సాక్షి పశ్చిమగోదావరి

శుక్రవారం | 23 | ఫిబ్రవరి | 2024



జగనన్నతోనే రాష్ట్ర భవిష్యత్

రాష్ట్ర భవిష్యత్, పిల్లల భవిష్యత్ బాగుండాలంటే జగనన్న మరోసారి సీఎం కావాలని హోం మంత్రి తానేటి వనిత అన్నారు. IIలో ▸



వైఎస్సార్ సీపీలోకి చేరికలు

గణపవరం మండలం అప్పనపేటకి చెందిన వివిధ పార్టీల నాయకులు ఎమ్మెల్యే వాసు బాబు సమక్షంలో వైఎస్సార్‌సీపీలో చేరారు. IIలో ▸



మనసు గెలిచిన వలంటీర్లు

పథకాలను ప్రజలకు చేరువ చేయడంలో వలంటీర్ల సేవలు ఎనలేనివని పాలకొల్లు నియోజకవర్గ ఇన్‌చార్జి గుడాల గోపి అన్నారు. IIలో ▸

న్యూస్‌రీల్

వైఎస్సార్ సీపీ ఎన్నికల పరిశీలకుల నియామకం

ఏలూరు టౌన్: వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు ఏలూరు, పశ్చిమగోదావరి జిల్లాల్లోని ఆయా నియోజకవర్గాలకు సంబంధించి ఎన్నికల పరిశీలకులను నియమిస్తూ ఆదేశాలు జారీ చేశారు. ఈ మేరకు గురువారం రాత్రి పార్టీ కేంద్ర కార్యాలయం ఉత్తర్వులు జారీ చేసింది. రాబోయే సార్వత్రిక ఎన్నికల్లో ఆయా నియోజకవర్గాల్లో పార్టీ సమన్వయానికి వీరంతా పనిచేయాల్సి ఉంది.

- ఏలూరు జిల్లా : దెందులూరు నియోజకవర్గ పరిశీలకుడిగా నెరుసు నాగసత్యం, ఏలూరు నియోజకవర్గ పరిశీలకుడిగా ఘంటా ప్రసాదరావు, చింతలపూడి నియోజకవర్గ పరిశీలకుడిగా ముదుగురు సూర్యనారాయణ నియమితులయ్యారు.
- పశ్చిమగోదావరి జిల్లా : పాలకొల్లు నియోజకవర్గ పరిశీలకుడిగా పాతపాటి శ్రీనివాసరాజు, నరసాపురం నియోజకవర్గ పరిశీలకుడిగా వేండ్ర వెంకటస్వామి, భీమవరం నియోజకవర్గ పరిశీలకుడిగా మోటుపల్లి గంగాధర్‌ను నియమిస్తూ ఆదేశాలు జారీ చేశారు.

పకడ్బందీగా బందోబస్తు



వాహనాలను తనిఖీ చేస్తున్న ఎస్పీ

ఆకివీడు: పోలింగ్ కేంద్రాల వద్ద, సమస్యాత్మక గ్రామాల్లో పోలీస్ బందోబస్తు పకడ్బందీగా ఏర్పాటు చేసేందుకు అన్ని పోలింగ్ కేంద్రాల్ని పరిశీలిస్తున్నామని జిల్లా ఎస్పీ వేజెండ్ల అజిత తెలిపారు. స్థానిక జెడ్పీ స్కూల్‌లోని పోలింగ్ సెంటర్లను గురువారం ఆమె పరిశీలించారు. అనంతరం ఉప్పుటేరు వంతెన వద్ద ఉన్న పోలీస్ చెక్‌పోస్టును సందర్శించారు. సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని సూచించారు.

ఆశ్రంలో డి-అడిక్షన్ సెంటర్



సెంటర్ ప్రారంభోత్సవంలో ఏఎస్పీ

ఏలూరు రూరల్: డ్రగ్స్‌రహిత సమాజాన్ని తీర్చిదిద్దేందుకు ప్రతిఒక్కరూ కృషి చేయాలని ఏలూరు జిల్లా అడిషనల్ ఎస్పీ ఎన్.సూర్యచంద్రరావు అన్నారు. గురువారం ఏలూరు ఆశ్రం ఆస్పత్రి ఆవరణలో ఏర్పాటుచేసిన డి-అడిక్షన్ సెంటర్‌ను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మద్యం, పొగాకు, మత్తు పదార్థాలు, మాదక ద్రవ్యాలు, జూదం, సెల్‌ఫోన్ తదితర వ్యసనాలతో బాధపడే వారికి వైద్యం అందించేందుకు ఆశ్రం యాజమాన్యం డి-అడిక్షన్ సెంటర్‌ను ఏర్పాటుచేయడం శుభపరిణామమన్నారు. వ్యసనాలతో తీవ్రంగా బాధపడే రోగులకు సహేతుక ఖర్చుతో డి-అడిక్షన్ సెంటర్ ద్వారా వైద్య సేవలు అందిస్తామని ఆశ్రం సీఈఓ డాక్టర్ కె. హనుమంతురావు తెలిపారు. 24 గంటలు వైద్యులు, నర్సింగ్ సిబ్బంది అందుబాటులో ఉంటారన్నారు. రక్తపరీక్షలు, పోషకాహారం, కౌన్సెలింగ్, గ్రూప్ థెరపీతో 21 రోజుల పాటు సేవలు ప్రక్రియ కొనసాగుతుందన్నారు. ఆశ్రం డైరెక్టర్ జి.రతీదేవి, వైద్యులు పాల్గొన్నారు.

24న హైకోర్టు జడ్జిల రాక

నరసాపురం: నరసాపురం కోర్టు సముదాయంలోని బార్ అసోసియేషన్ హాల్‌లో శనివారం సీనియర్ న్యాయవాది అందే బాపన్న చిత్రపటాన్ని ఆవిష్కరించనున్నారు. ఈ కార్యక్రమానికి హైకోర్టు జడ్జిలు ఆకుల శేషసాయి, నైనాల జయసూర్య, తల్లాప్రగడ మల్లికార్జునరావు, హరినాథ్ మానేపల్లి, ఉమ్మడి ఏపీ హైకోర్టు రిటైర్డ్ జడ్జిలు గ్రంధి భవానీప్రసాద్, డీఆర్ఎస్ వర్మ, సీవై సోమయాజులు హాజరుకానున్నారని బార్ అసోసియేషన్ అధ్యక్షుడు చల్లా దానయ్యనాయుడు చెప్పారు.

నేడు 'డయల్ యువర్ ఎస్పీ'

భీమవరం: ప్రజాసమస్యలను తెలుసుకునేందుకు ఎస్పీ వేజెండ్ల అజిత ఇకపై ప్రతి శుక్రవారం 'డయల్ యువర్ ఎస్పీ' కార్యక్రమం నిర్వహించనున్నారని ఎస్పీ కార్యాలయం గురువారం ఒక ప్రకటనలో తెలిపింది. ఉదయం 11 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు సెల్ 90001 10289 నంబర్‌లో ఎస్పీ దృష్టికి సమస్యలు తీసుకురావచ్చు.

24న విజిలెన్స్ కమిటీ సమావేశం

తాడేపల్లిగూడెం రూరల్: స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో శనివారం ఉదయం 11 గంటలకు డివిజనల్ విజిలెన్స్, మానిటరింగ్ కమిటీ సమావేశం నిర్వహించనున్నట్టు సహాయ సాంఘిక సంక్షేమాధికారి బాలగోపాల రామాంజనేయరాజు తెలిపారు. ఆర్డీఓ కె.చెన్నయ్య అధ్యక్షత వహిస్తారన్నారు.

నేత్రపర్వం.. నరసన్న కల్యాణం

ఐఎస్ జగన్నాథపురంలో పరిణయోత్సవం



కమనీయం.. కడు రమణీయం

ఐఎస్ జగన్నాథపురంలో నారసింహుని కల్యాణ తంతు నిర్వహిస్తున్న పండితులు

ద్వారకాతిరుమల: ఐఎస్ జగన్నాథపురంలోని నారసింహస్వామి క్షేత్రంలో స్వామివారి కల్యాణోత్సవం గురువారం నేత్రపర్వంగా జరిగింది. ముందుగా శ్రీదేవి, భూదేవి సమేత నారసింహుని ఉత్సవ మూర్తులను సుందరగిరిపై నుంచి కొండ కింద కల్యాణ మండపం వద్దకు తీసుకొచ్చారు. అక్కడ ప్రత్యేకంగా అలంకరించిన వేదికపై ఉత్సవ మూర్తులను వేంచేపు చేసి విశేషంగా అలంకరించారు. విశ్వక్సేన ఆరాధన, పుణ్యాహవాచనం, కన్యాదానం జరిపి ఉదయం 11.10 గంటల సుముహూర్త సమయంలో కల్యాణ తంతు జరిపించారు. ప్రభుత్వం తరఫున హోం శాఖ మంత్రి, గోపాలపురం నియోజకవర్గ ఇన్‌చార్జి తానేటి వనిత, దేవస్థానం తరఫున ఆలయ ఈఓ వేండ్ర త్రినాథరావు, అనువంశిక ధర్మకర్త ఎస్వీ నివృతరావు స్వామి, అమ్మవార్లకు పట్టువస్త్రాలను సమర్పించారు. వేడుక అనంతరం భక్తులకు అన్నప్రసాదాన్ని అందించారు. రాష్ట్ర ఫైనాన్స్ కార్పొరేషన్ డైరెక్టర్ చెలికాని రాజబాబు, ట్రస్టుబోర్డు సభ్యులు పెద్దిరెడ్డి పద్మ జ్యోతి, మానుకొండ సుబ్బారావు, ఆచంట అనసూయ, వాసే రామకృష్ణ, తొమ్మండ్రు రమేష్, జెడ్పీటీసీ చిగురుపల్లి శామ్యూల్, సర్పంచ్‌లు పసుపులేటి ఏసుబాబు, దాకారపు బంగారమ్మ తదితరులు పాల్గొన్నారు.



పట్టువస్త్రాలు తీసుకువస్తున్న హోం మంత్రి వనిత, ఈఓ త్రినాథరావు, అనువంశిక ధర్మకర్త నివృతరావు



ఉత్సవమూర్తులకు హారతులిస్తున్న దృశ్యం



రైతులకు తోడుగా గోడౌన్లు

అన్నదాతల సంక్షేమమే లక్ష్యంగా సీఎం జగన్‌మోహన్‌రెడ్డి పాలన సాగిస్తూ వ్యవసాయానికి అన్నింటా అండగా ఉంటున్నారు. విత్తు నుంచి పంట విక్రయాల వరకూ భరోసాగా నిలుస్తున్నారు. అలాగే రైతులు తమ పంటలను నిల్వ చేసుకుని మద్దతు ధర వచ్చినప్పుడు విక్రయించుకునేలా, ఎరువులు, విత్తనాలు కూడా నిల్వ చేసుకునేలా రాష్ట్రవ్యాప్తంగా మల్టీ పర్పస్ గోడౌన్ల నిర్మాణానికి శ్రీకారం చుట్టారు. పశ్చిమగోదావరి జిల్లాలో తొలి విడతలో 24 గోడౌన్లు మంజూరు చేశారు.

వడివడిగా నిర్మాణాలు

- జిల్లాకు 24 మల్టీపర్పస్ గోడౌన్ల మంజూరు
- రూ.10.56 కోట్లతో పనులు
- 6 గోదాముల నిర్మాణం పూర్తి
- చాలా చోట్ల 50 శాతానికిపైగా పనులు
- ఒక్కో గోదాముకు రూ.44 లక్షల వ్యయం
- వరి, ఆక్వా ఉత్పత్తుల నిల్వకు ఊతం



మెట్ట ఉప్పరగూడెంలో గోదాము



శేరేపాలెంలో నిర్మాణం పూర్తయిన గోడౌన్

భీమవరం(ప్రకాశం చౌక్): పశ్చిమగోదావరి జిల్లాకు మూడు విడతల్లో 129 గోడౌన్లను ప్రభుత్వం మంజూరు చేయగా ఫేజ్-1లో 24 గోడౌన్లకు గాను 23 చోట్ల నిర్మాణాలు మొదలయ్యాయి. వీటి నిర్మాణాలు శరవేగంగా జరుగుతున్నాయి. ఆయా మార్కెట్ యార్డు పరిధిలో రైతులకు అందుబాటులో ఉంచేలా వీటిని నిర్మిస్తున్నారు. ధాన్యం, కూరగాయ పంటలు, రొయ్యలు, చేపలు వంటివి నిల్వ చేసుకునేలా వీటి నిర్మాణాలు చేపట్టారు. జిల్లాలో ఇప్పటికే ఆరు చోట్ల నిర్మాణాలు పూర్తయి గోడౌన్లు అందుబాటులోకి వచ్చాయి.

500 టన్నుల సామర్థ్యంతో..

జిల్లాలో 500 టన్నుల సామర్థ్యం, అన్ని రకాల సౌకర్యాలతో గోదాముల నిర్మాణాలను చేపట్టారు. ఒక్కో గోడౌన్‌కు రూ.44 లక్షలు వెచ్చిస్తుండగా మొత్తంగా 24 గోడౌన్లకు రూ.10.56 కోట్లు ఖర్చు చేయనున్నారు. ఇప్పటికే ఆరు గోడౌన్లు అందుబాటులోకి రాగా మిగిలిన వివిధ దశల్లో ఉన్నాయి. మార్కెటింగ్, రెవెన్యూ, కో-ఆపరేటివ్ తదితర శాఖల అధికారులు సమన్వయంతో మల్టీపర్పస్ గోడౌన్ల నిర్మాణం వేగంగా జరిగేలా చర్యలు తీసుకుంటున్నారు.

ఆక్వా రైతులకు ఎంతో మేలు

జిల్లాలోని భీమవరం, కాళ్ల, శేరేపాలెం, మత్స్యపురి, కేశవరం, పిప్పర, మహదేవపట్నం, ఏలూరుపాడు, శృంగవృక్షం, మోగల్లు, మల్లవరం, చేమకూరిపాలెం, రామన్నపాలెం తదితర ప్రాంతాల్లో నిర్మిస్తున్న మల్టీపర్పస్ గోడౌన్లు రొయ్యలు, చేపలు సాగుచేసే రైతులకు ఎంతో ఉపయోగపడతాయి. ఆక్వా ఉత్పత్తులను ఈ గోడౌన్లలో కోల్డ్ స్టోరేజీ సౌకర్యంతో నిల్వ చేసుకునే సదుపాయం ఉంటుంది. రైతులు ఆక్వా ఫ్యాక్టరీల్లో తమ ఉత్పత్తులను నిల్వ చేయాలంటే ఖర్చుతో కూడుకున్న పని. అదే ప్రభుత్వ గోడౌన్లతో తక్కువ ఖర్చుతో లేదా ఉచితంగా నిల్వ చేసుకునే అవకాశం ఉంటుంది. అలాగే తాడేపల్లిగూడెం, పెంటపాడు, తణుకు, ఆచంట, పోడూరు, పెనుగొండ తదితర మండలాల్లో నిర్మించే గోడౌన్లు ధాన్యం, కూరగాయ పంటల నిల్వకు ఉపయోగపడతాయి.

గత ప్రభుత్వంలో ఊసేలేదు

గత టీడీపీ పాలనలో పాలకులు గోడౌన్ల ఊసే ఎత్తలేదు. వ్యవసాయం దండగగా భావించిన చంద్రబాబు రైతులకు ఎటువంటి సహకారం అందించలేదు. అయితే వ్యవసాయాన్ని పండగ చేయాలనే లక్ష్యంతో సీఎం జగన్ ధాన్యం, రొయ్యలు, చేపలకు మద్దతు ధర ఇచ్చేలా చర్యలు తీసుకున్నారు. ఆక్వా రైతులకు విద్యుత్ రాయితీ అందిస్తున్నారు. కరోనా సమయంలో ఆక్వా రైతులకు ఇబ్బందులు లేకుండా ఉత్పత్తులను మార్కెటింగ్ చేసుకునేలా ప్రభుత్వం నుంచి పూర్తి సహకారం అందించారు. విపత్తుల సమయంలో పంటలను కాపాడుకోవడంతో పాటు ధరలు పెరిగినప్పుడు విక్రయించుకునేలా పంట ఉత్పత్తులను నిల్వ చేసుకునేలా అన్ని ప్రాంతాల్లో గోడౌన్లు నిర్మిస్తున్నారు.

వేగంగా గోదాముల నిర్మాణాలు



రైతు సంక్షేమమే ధ్యేయంగా ప్రభుత్వం మల్టీపర్పస్ గోడౌన్ల నిర్మాణాలు చేపట్టింది. జిల్లాలో తొలివిడత గోడౌన్ల నిర్మాణాలు చురుగ్గా జరుగుతున్నాయి. ఆరు గోదాములు అందుబాటులోకి వచ్చాయి. మిగిలిన వాటిలో 50 నుంచి 90 శాతం మేర నిర్మాణాలు ఉన్నాయి. గోడౌన్లను వేగంగా రైతులకు అందుబాటులోకి తీసుకురావడానికి చర్యలు తీసుకుంటున్నాం.

– కె.సునీల్, మార్కెటింగ్ శాఖ ఏడీఏ, భీమవరం

జిల్లాలో గోడౌన్ల నిర్మాణం

మండలం	గ్రామం	నిర్మాణ స్థితి
పెంటపాడు	రావిపాడు	అందుబాటులోకి
తాడేపల్లిగూడెం	మెట్ట ఉప్పరగూడెం	అందుబాటులోకి
తణుకు	కొమరవరం	అందుబాటులోకి
మొగల్తూరు	శేరేపాలెం	అందుబాటులోకి
మొగల్తూరు	రామన్నపాలెం	అందుబాటులోకి
నరసాపురం	మల్లవరం	అందుబాటులోకి
ఆకివీడు	అజ్జమూరు	90 శాతం పూర్తి
ఆచంట	పెనుమంచిలి	90 శాతం పూర్తి
ఆచంట	ఆచంట	90 శాతం పూర్తి
కాళ్ల	కాళ్ల	50 శాతం పూర్తి
నరసాపురం	చేమకూరిపాలెం	50 శాతం పూర్తి
పాలకోడేరు	మోగల్లు	90 శాతం పూర్తి
పాలకోడేరు	శృంగవృక్షం	60 శాతం పూర్తి
పోడూరు	పండితవిల్లూరు	90 శాతం పూర్తి
పోడూరు	పోడూరు	90 శాతం పూర్తి
భీమవరం	తుందుర్రు	–
పెనుగొండ	చినమల్లం	90 శాతం పూర్తి
కాళ్ల	ఏలూరుపాడు	50 శాతం పూర్తి
ఉండి	మహాదేవపట్నం	40 శాతం పూర్తి
వీరవాసరం	మత్స్యపురి	30 శాతం పూర్తి
గణపవరం	కేశవరం	30 శాతం పూర్తి
గణపవరం	పిప్పర	40 శాతం పూర్తి
పెంటపాడు	అలంపురం	30 శాతం పూర్తి

మాటిస్తే నిలబెట్టుకోవాలి

డిప్యూటీ సీఎం కొట్టు సత్యనారాయణ



ప్రజలతో మాట్లాడుతున్న మంత్రి కొట్టు

తాడేపల్లిగూడెం రూరల్: ఎన్నికల్లో మాటిస్తే నిలబెట్టుకునేలా ఉండాలని, చంద్రబాబు-పవన్ మాదిరిగా ఇచ్చిన హామీలు ఎన్నికల వరకే పరిమితం కాకూడదని డిప్యూటీ సీఎం కొట్టు సత్యనారాయణ అన్నారు. గురువారం మండలంలోని కుంచనపల్లి గ్రామంలో సకల జన సమ్మేళన పాదయాత్ర నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాబోయే రోజుల్లో పింఛన్ మరింత పెంచే ఆలోచన ఉందన్నారు. అమ్మఒడి, ఆసరా, చేయూత, పింఛన్ కానుక వంటి పథకాల ద్వారా ప్రతి కుటుంబానికీ లబ్ధి చేకూర్చిన ఘనత సీఎం జగన్‌కే దక్కుతుందన్నారు. విద్యకు అధిక ప్రాధాన్యమిస్తూ ప్రభుత్వ పాఠశాలల రూపురేఖలు మార్చారన్నారు. పేద పిల్లలకు కార్పొరేట్ తరహా విద్యను అందిస్తున్నారన్నారు. అనంతరం ఆయన ఇంటింటికీ తిరిగి ప్రభుత్వ పథకాలపై ఆరా తీశారు. ముందుగా గ్రామంలో పునర్నిర్మించిన ఆలయంలో దేశాలమ్మవారిని దర్శించుకున్నారు. గ్రామాన్ని అన్నివిధాలా అభివృద్ధి పథంలో నడిపించడానికి కృషి చేస్తానన్నారు. ఆయన వెంట ఏఎంసీ చైర్మన్ ముప్పిడి సంపత్‌కుమార్, ఉప్పరగూడెం సర్పంచ్ దండే కనకబాబు, దుర్గామల్లేశ్వరస్వామి వారి దేవస్థానం ట్రస్ట్ బోర్డు సభ్యుడు చెన్నా జనార్దనరావు, పార్టీ మండల అధ్యక్షుడు జడ్డు హరిబాబు, సొసైటీ చైర్మన్ గుమ్మళ్ల తాతారావు, ఆలయ కమిటీ చైర్మన్ సోమా మురళీకృష్ణ, నాయకులు, అధికారులు ఉన్నారు.

చింతలపూడి 'దేశం'లో రాజకీయ చిచ్చు

- మాజీ మంత్రి పీతల సుజాతకు ఝలక్
- నియోజకవర్గ ఇన్‌చార్జిగా సొంగా రోషన్ నియామకం
- అసంతృప్తితో పవన్‌కళ్యాణ్ సమావేశానికి సుజాత దూరం



పీతల సుజాత, టీడీపీ మాజీ మంత్రి

సాక్షి ప్రతినిధి, ఏలూరు: చింతలపూడి నియోజకవర్గ తెలుగుదేశం పార్టీ ఇన్‌చార్జిగా ఎన్ఆర్ఐ సొంగా రోషన్‌కుమార్ నియామకం రాజకీయ చిచ్చురేపింది. టికెట్ ఆశిస్తూ ఐదేళ్లుగా రూ.కోట్లు కుమ్మరించిన నేతలను, దళిత మహిళా నేత, మాజీ మంత్రి పీతల సుజాతను కాదని కొత్త వ్యక్తికి ఇవ్వడంపై రాజకీయ రగడ మొదలైంది. ఈ అంశంపై సుజాత తీవ్ర అసంతృప్తితో ఉన్నారు. జిల్లాలో బుధవారం జరిగిన పవన్‌కళ్యాణ్ సమావేశానికి ఆమె గైర్హాజరయ్యారు. దీంతో పాటు ఉమ్మడి పశ్చిమగోదావరిలో ఎస్సీల్లో ఒకే సామాజిక వర్గానికి టికెట్లు కేటాయించడంపైనా నిరసన వ్యక్తమవుతోంది. అనూహ్యంగా సొంగా రోషన్‌ను ఇన్‌చార్జిగా నియమించడం, టికెట్ అతనికేనంటూ కేడర్‌కు సంకేతాలు పంపేలా నియామక ప్రకటన చేయడంతో చింతలపూడి తెలుగుదేశం పార్టీలో గందరగోళం మొదలైంది. జిల్లా తెలుగుదేశం రాజకీయాల్లో దళిత మహిళగా పీతల సుజాత కీలకంగా పనిచేశారు. 2004లో టీచర్ ఉద్యోగాన్ని వదులుకుని క్రియాశీలక రాజకీయాల్లోకి వచ్చిన ఆమె ఆచంట నుంచి టీడీపీ అభ్యర్థిగా గెలుపొందారు. ఆ తరువాత రాజకీయ సమీకరణాల కారణాలు చెప్పి 2009లో టికెట్ కేటాయించలేదు. 2014లో చింతలపూడి అభ్యర్థిగా టికెట్ కేటాయించడంతో గెలిచి, మంత్రిగా కూడా పనిచేశారు. అయితే ఆ సమయంలో చంద్రబాబు సామాజికవర్గ ప్రజాప్రతినిధుల చేతుల్లో అవమానాలు, ఇబ్బందులు ఎదుర్కొని వారి లాబీయింగ్‌తో మంత్రి పదవి నుంచి మధ్యలోనే వైదొలిగారు. 2019 ఎన్నికల్లో చింతలపూడి టికెట్ ఆశించినా మొండిచేయి చూపారు. టీడీపీ ఓటమి అనంతరం ఇన్‌చార్జి బాధ్యతలు ఇవ్వాలని అడిగినా చంద్రబాబు పట్టించుకోలేదు. అయినా పార్టీలోనే ఉండి చింతలపూడిలో క్రియాశీలకంగా పనిచేశారు. ఈ నేపథ్యంలో ఈసారి కూడా ఆమెకు మొండిచేయి చూపడంతో సుజాత వర్గం తీవ్ర అసంతృప్తితో రగులుతోంది. దీనికి తోడు ఉమ్మడి పశ్చిమగోదావరిలోని మూడు రిజర్వు స్థానాలూ ఎస్సీల్లో ఒకే సామాజిక వర్గానికి టీడీపీ టికెట్ కేటాయించిందన్న ప్రచారం బలంగా సాగుతోంది. దళిత మహిళను అవమానపరిచారంటూ సోషల్ మీడియాలో పోస్టులు పెడుతున్నారు. సుజాతతో పాటు టికెట్ ఆశించిన బొమ్మాజీ అనిల్ కూడా మాగంటి బాబు, చింతమనేనిల ప్రోద్బలంతో యువగళం, చంద్రబాబు సభలకు భారీగా ఖర్చు చేశారు. పార్టీ డబ్బు అవసరాలకు వాడుకుని చివరికి ఆయనకూ మొండిచేయి చూపారు.

ప్రశాంతంగా ఎన్నికల నిర్వహణకు చర్యలు

కలెక్టర్ సుమిత్‌కుమార్ గాంధీ



సూచనలిస్తున్న కలెక్టర్ సుమిత్‌కుమార్ గాంధీ

భీమవరం(ప్రకాశం చౌక్): జిల్లాలో ఎన్నికలు ప్రశాంత వాతావరణంలో నిర్వహించేందుకు, సమస్యాత్మక, అతి సమస్యాత్మక పోలింగ్ కేంద్రాలు, ప్రాంతాలను గుర్తించి నివేదిక అందజేయాలని సెక్టార్ అధికారులను కలెక్టర్ సుమిత్‌కుమార్ గాంధీ ఆదేశించారు. గురువారం కలెక్టరేట్ నుంచి ఆర్డీఓలు, తహసీల్దార్లు, సెక్టార్ అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్షించారు. జిల్లాలో ఎన్నికలు ప్రశాంతంగా నిర్వహించేందుకు అన్ని చర్యలు చేపడుతున్నట్టు చెప్పారు. దీనిలో భాగంగా సమస్యాత్మక, అతి సమస్యాత్మక ప్రాంతాలను, పోలింగ్ కేంద్రాలను కచ్చితంగా గుర్తించి ఈనెల 28లోపు నివేదిక అందజేయాలన్నారు జిల్లాలో 1,461 పోలింగ్ కేంద్రాలు ఉండగా సమస్యాత్మక పరిధిలో 184 కేంద్రాలు, అతి సమస్యాత్మక పరిధిలో 215 పోలింగ్ కేంద్రాలను ప్రాథమికంగా గుర్తించామని, మరోమారు క్షేత్రస్థాయిలో పరిశీలించి నివేదిక అందజేయాలన్నారు. అతి సమస్యాత్మక కేంద్రాల పరిధిలో మైక్రో అబ్జర్వర్ల పర్యవేక్షణలో ఎన్నికలు నిర్వహిస్తారన్నారు. జిల్లా అడిషనల్ ఎస్పీ వి.భీమారావు మాట్లాడుతూ గత ఎన్నికల్లో మూడు ప్రత్యేక ఫోర్సులను వినియోగించారని, ఈసారి అదనంగా ఫోర్సులను కోరుతున్నామన్నారు. సెబ్ ఏఎస్పీ ఏటీవీ రవికుమార్, ఎన్నికల తహసీల్దార్ సీహెచ్ దుర్గాప్రసాద్, ఎన్నికల డిప్యూటీ తహసీల్దార్ ఎం.సన్యాసిరావు, సీఐలు పీవీజీ తిలక్, ఎన్.చలపతిరావు తదితరులు పాల్గొన్నారు.

పరీక్షలకు పటిష్ట ఏర్పాట్లు

భీమవరం: జిల్లాలో టెన్త్, ఇంటర్, డీఎస్సీ, టెట్ పరీక్షల నిర్వహణకు ముందస్తు ఏర్పాట్లు చేపట్టినట్టు కలెక్టర్ సుమిత్‌కుమార్ గాంధీ తెలిపారు. గురువారం తాడేపల్లిలోని విద్యాశాఖ కార్యాలయం నుంచి పరీక్షల నిర్వహణపై వీడియో కాన్ఫరెన్స్ జరిగింది. అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో పరీక్షల నిర్వహణకు స్పష్టమైన ఆదేశాలను జారీ చేశామన్నారు. కేంద్రాలకు ఎంపిక చేసిన కళాశాలలు, పాఠశాలల్లో మౌలిక వసతుల కల్పన, వైద్య శిబిరాలు, మందులకు ఆదేశాలిచ్చామన్నారు. విద్యుత్ సరఫరాకు అంతరాయం లేకుండా చూడాలని, జనరేటర్ల ఏర్పాట్లను పర్యవేక్షించాలన్నారు. కేంద్రాలకు ఆర్టీసీ బస్సులు నడిపేలా చర్యలు తీసుకోవాలన్నారు. టెన్త్ పరీక్షలకు 21,341 మంది రెగ్యులర్, 6,085 మంది ఫెయిల్ అయిన విద్యార్థులు హాజరు కానున్నారని చెప్పారు. ఇంటర్ పరీక్షలకు 35,949 మంది, వీరిలో ఫస్టియర్ జనరల్ 16,017 మంది, ఒకేషనల్ 1,789 మంది, సెకండియర్ జనరల్ 16,362 మంది, 1,781 మంది ఒకేషనల్ విద్యార్థులు ఉన్నారన్నారు. ఏఎస్పీ వి.భీమారావు, డీఈఓ ఆర్.వెంకటరమణ, ఇంటర్మీడియట్ ఎడ్యుకేషన్ ఇన్‌స్పెక్షన్ అధికారి కె.చంద్ర శేఖరబాబు పాల్గొన్నారు.

ఉండిలో కుంగిపోనున్న టీడీపీ



పీవీఎల్ నర్సింహరాజు, డీసీసీబీ చైర్మన్

ఆకివీడు: కుప్పం మాదిరి ఉండి నియోజకవర్గ టీడీపీ కూడా కుంగిపోతుందని డీసీసీబీ చైర్మన్ పీవీఎల్ నర్సింహరాజు అన్నారు. గురువారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ కుప్పం నుంచి చంద్రబాబు పలాయనం చిత్తగిస్తున్నారని ఎద్దేవా చేశారు. కుప్పం నియోజకవర్గానికి చంద్రబాబు చేసిందేమీ లేదని ప్రజలు గ్రహించారని, సీఎం జగన్ పాలనలో కుప్పం రూపురేఖలు మారిపోయాయన్నారు. అభివృద్ధి కార్యక్రమాలతో పాటు సాగు, తాగునీరందించిన ఘనత సీఎం జగన్‌కే దక్కుతుందన్నారు. దీంతో చంద్రబాబు ఓటమి పాలవుతారని భువనేశ్వరిని రంగంలోకి దింపుతున్నారన్నారు. అదే రీతిలో ఉండి నియోజకవర్గంలోనూ ఎన్నికల తర్వాత టీడీపీ కూనరిల్లుతుందన్నారు. మూడున్నర దశాబ్దాల పాటు టీడీపీ ఎమ్మెల్యేలు ఇక్కడ పనిచేసినా ఒక్క శాశ్వత పని చేపట్టలేదన్నారు. ఎమ్మెల్యేల అసమర్థతతో కనీసం గ్రామాల్లో రోడ్లు, వంతెనలు కూడా నిర్మించలేదన్నారు. శిథిలావస్థలో పాఠశాలలు, లోటెజీ సమస్యలతో ప్రజలు ఇబ్బందులు పడ్డారన్నారు. వైఎస్సార్ హయాంలో మాజీ ఎమ్మెల్యే సర్రాజు నేతృత్వంలో మాత్రమే రూ.800 కోట్ల మేర అభివృద్ధి పనులు చేశారన్నారు. తాళ్లకోడులో పేదలకు ఇళ్ల స్థలాల కోసం 74 ఎకరాలు సేకరించి పట్టాలు ఇచ్చినా తర్వాత ఎమ్మెల్యేలు కనీసం లేఅవుట్‌లు కూడా వేయించలేదని విమర్శించారు.

జగన్ పాలనలో మారిన రూపురేఖలు

సీఎం జగన్ 58 నెలల పాలనలో ఉండి నియోజకవర్గ రూపురేఖలు మార్చివేశామని పీవీఎల్ అన్నారు. సంక్షేమ, అభివృద్ధి పథకాలతో అన్నివర్గాల ప్రజలు ఆనందంగా ఉన్నారన్నారు. కార్పొరేట్ వసతులతో ప్రభుత్వ బడులు, గ్రామాల్లో సీసీ రోడ్లు, ప్రధాన రహదారుల నిర్మాణం దాదాపు పూర్తయ్యిందన్నారు. నియోజకవర్గ అభివృద్ధికి సీఎం జగన్ ప్రోత్సాహాన్ని మరువలేనన్నారు. వచ్చే ఎన్నికల్లో నియోజకవర్గంలో వైఎస్సార్‌సీపీ జెండా ఎగురవేస్తామని ఆయన ధీమా వ్యక్తం చేశారు.

క్లుప్తంగా

వీరేశ్వరస్వామి హుండీ లెక్కింపు



పట్టిసీమ వీరేశ్వరస్వామి ఆలయంలో హుండీ కానుకలను లెక్కిస్తున్న దృశ్యం

పోలవరం రూరల్ : అఖండ గోదావరి నది మధ్య గల పట్టిసం శివక్షేత్రంలో హుండీల లెక్కింపు నిర్వహించారు. గురువారం దేవస్థానం ఈవో ఎస్ఎస్ సంగమేశ్వర శర్మ, ఫౌండర్ ఫ్యామిలీ మెంబర్ కె.వీరభద్రరరావు ఆధ్వర్యంలో సిబ్బంది క్షేత్రం ఆవరణలో హుండీ కానుకలను లెక్కించారు. గత సంవత్సరం మహాశివరాత్రి ఉత్సవాల తరువాతి నుంచి నేటి వరకు హుండీ ఆదాయాన్ని లెక్కించినట్లు ఈవో తెలిపారు. లెక్కింపులో రూ.4,78,740 ఆదాయం వచ్చినట్లు పేర్కొన్నారు.

60 లీటర్ల సారా పట్టివేత



పట్టుకున్న సారా ప్యాకెట్లు

పోలవరం రూరల్ : పోలవరం మండలంలో అత్యంత మారుమూల కొండపై ఉన్న మెత్తాపుకోట గ్రామంలో ఎస్సై ఎస్ఎస్ పవన్‌కుమార్ సిబ్బందితో కలిసి సారా బట్టీలపై దాడులు నిర్వహించారు. సారా తయారు చేసి ప్యాకెట్లు కట్టి తరలిస్తుండగా, దారి మధ్యలో ఎం.రమేష్ అనే వ్యక్తిని అదుపులోకి తీసుకుని అతని నుంచి 60 లీటర్ల సారాను స్వాధీనం చేసుకున్నారు. సారా తయారు చేసినా, అమ్మకాలు చేసినా చర్యలు తీసుకుంటామని ఎస్సై హెచ్చరించారు.

పీహెచ్‌సీ ఆకస్మిక తనిఖీ

పాలకోడేరు: ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో కాన్పులు అధిక సంఖ్యలో జరిగేలా చర్యలు తీసుకోవాలని డీఎం అండ్ హెచ్‌వో మహేశ్వరరావు అన్నారు. పాలకోడేరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని గురువారం రాత్రి డీఎంహెచ్‌ఓ ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఆసుపత్రిలో డెలివరీలు వేసే రూమును, సిబ్బంది వేసే అటెండెన్స్, ఇతర గదులను పరిశీలించారు. ఆసుపత్రిలో స్టాఫ్ నర్స్ ఎస్తేరును వివరాలు అడిగి తెలుసుకున్నారు.

సీఎం మనసు గెలిచిన వలంటీర్లు

- రానున్న 3 నెలలు ధైర్యంగా పనిచేయండి
- వైఎస్సార్ సీపీ పాలకొల్లు ఇన్‌చార్జి గూడాల గోపి
- వలంటీర్లకు వజ్ర, రత్న అవార్డుల ప్రదానం

పాలకొల్లు అర్బన్ : రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న నవరత్నాల పథకాలను ప్రజలకు చేరువ చేయడంలో వలంటీర్లు విలువైన సేవలు అందించి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మనస్సును గెలుచుకున్నారని వైఎస్సార్ సీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి గుడాల శ్రీహరి గోపాలరావు (గోపి) ప్రశంసించారు. పాలకొల్లు మండల పరిషత్ కార్యాలయ ఆవరణలో నియోజకవర్గంలో సేవా వజ్ర, సేవా రత్న అవార్డులు గెలుచుకున్న 19 మంది వలంటీర్లను శాలువాతో సత్కరించిన సందర్భంగా గోపి మాట్లాడారు. రానున్న మూడు నెలల కాలంలో వలంటీర్లకు ఎన్నో బెదిరింపులు వస్తాయని, వాటిని పట్టించుకోకుండా ధైర్యంగా పనిచేయాలని కోరారు. అలాగే పాలకొల్లులో ఎమ్మెల్యే నిమ్మల వలంటీర్లను



పాలకొల్లులో వజ్ర, రత్న అవార్డులు అందుకున్న వలంటీర్లను సత్కరించిన గుడాల గోపి

అనేక విధాలుగా ఇబ్బందులు పెడతారని, వాటికి లెక్కచేయవద్దని కోరారు. వలంటీర్లకు ఏ కష్టమొచ్చినా ఆదుకోవడానికి తాను సిద్ధంగా ఉంటానన్నారు. అలాగే అధికారులు వలంటీర్లను ఏమైనా ఇబ్బంది పెడితే తన దృష్టికి తీసుకురావాలని కోరారు. కరోనా సమయంలో వలంటీర్లు వారి ఆరోగ్యాన్ని సైతం లెక్కచేయకుండా ప్రజలకు సేవలందించినందుకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. పేద, మధ్య తరగతి ప్రజలకు సంక్షేమ పథకాలు అందించి వారి మనస్సులో నిలిచిపోయారని గోపి అభినందించారు. ఈ సందర్భంగా సేవా వజ్ర అవార్డులు అందుకున్న కేవీఎస్ మణికంఠ (పెనుమదం), ఆర్.లక్ష్మి (జిన్నూరు), యాండ్ర నాగవెంకట సత్యనారాయణ (కాజ పడమర), కందికట్ల ప్రసన్న (కాపవరం), కాకర్లమూడి ప్రియాంక (వెలివెల), అలాగే అలాగే సేవా రత్న అవార్డులు అందుకున్న 14 మందిని గుడాల గోపి శాలువాలతో సత్కరించి, మెడల్స్, ప్రశంసాపత్రాలు అందజేశారు. డీసీఎంఎస్ మాజీ చైర్మన్ యడ్ల తాతాజీ, మండల పరిషత్ మాజీ ప్రతిపక్ష నేత చిట్టూరి ఏడుకొండలు, ఏఎంసీ మాజీ చైర్మన్ సాలా నరసయ్య, వైస్ ఎంపీపీలు పడవల సునీల్‌బాబు, యన్నాబత్తుల నాగేశ్వరరావు, గుబ్బల సత్యనారాయణ, రావూరి కోటి మురళీకృష్ణ, గుబ్బల వేణు, చింతపల్లి సాయిబాబా మండల కన్వీనర్ విప్పర్తి ప్రభాకరరావు, పార్టీ గౌరవాధ్యక్షుడు ఎం.మైఖేల్‌రాజు, సర్పంచ్‌ల చాంబర్ అధ్యక్షుడు గుమ్మాపు పెద్దిరాజు, సర్పంచ్‌లు జమ్ము మహాలక్ష్మి, విశ్వనాథం కనకభద్రం, గవర, హౌసింగ్ కార్పొరేషన్ డైరెక్టర్లు బొడ్డేటి సూర్యనారాయణ, పెదపాటి పెద్దిరాజు పాల్గొన్నారు.

ఉత్తమ రచనగా మాతృ భాష ఔన్నత్యం



వై.శ్రీదేవి

పాలకొల్లు సెంట్రల్ : ఎలైట్ రైటర్స్ అసోసియేషన్ నిర్వహించిన రచనల్లో పాలకొల్లు పట్టణానికి చెందిన ఉపాధ్యాయిని వై.శ్రీదేవి రచించిన మాతృభాష ఔన్నత్యం ఉత్తమ రచనగా ఎంపికైంది. గత పాతికేళ్లుగా ప్రభుత్వ ఉపాధ్యాయినిగా పనిచేస్తున్న ఆమె సాహిత్యంలో తనదైన శైలిని ప్రదర్శిస్తున్నారు. శ్రీదేవి మాట్లాడుతూ తెలుగు కవులు, రచయితలను ప్రోత్సహించాలనే ఉద్దేశంతో ఎలైట్ రైటర్స్ అసోసియేషన్ చైర్మన్ డాక్టర్ చిటికెన కిరణ్ కుమార్, నిర్వాహకులు కె.పద్మావతి, కె.విద్యుల్లత, టి. సాధన, న్యాలకంటి నారాయణ సంయుక్త ఆధ్వర్యంలో ఈ పోటీలు నిర్వహిస్తున్నారని చెప్పారు. ఈ సందర్భంగా తాను రచించిన మాతృభాష ఔన్నత్యం రచన ఉత్తమ రచనగా నిలవడం ఆనందంగా ఉందన్నారు. ఈ సందర్భంగా శ్రీదేవిని పలువురు ఉపాధ్యాయులు, మిత్రులు అభినందించారు.

మాధవరంలో హీరో వరుణ్‌తేజ్ సందడి

తాడేపల్లిగూడెం రూరల్ : దేశంలో ప్రజలను తమ కుటుంబ సభ్యులుగా భావించి సరిహద్దుల్లో జవాన్లు సేవలందిస్తున్నారని సినీ హీరో వరుణ్ తేజ్ అన్నారు. మాధవరం గ్రామానికి గురువారం ఆయన విచ్చేసి అమరవీరుల స్తూపం వద్ద వీర జవాన్లకు నివాళులర్పించారు. ఈ సందర్భంగా వరుణ్ తేజ్ మాట్లాడుతూ దేశం కోసం త్యాగాలు చేస్తున్న గ్రామం ఉందని తెలుసుకుని మాధవరం వచ్చానన్నారు. జవాన్ల కుటుంబ సభ్యులతో ముఖాముఖి మాట్లాడటం సంతోషంగా ఉందన్నారు. జవాన్ల త్యాగాలను ప్రజల ముందుకు తీసుకువచ్చే ప్రయత్నమే తన తాజా చిత్రం 'ఆపరేషన్ వాలంటైన్' అని తెలిపారు. ఈ చిత్రాన్ని ప్రజలంతా ఆదరించాలని కోరారు. సర్పంచ్ ముప్పిడి సూర్యకుమారి, మాజీ సైనికుల సంక్షేమ సంఘం



మాధవరంలో అమరవీరుల స్తూపం వద్ద జోహార్లు అర్పిస్తున్న హీరో వరుణ్ తేజ్

గౌరవాధ్యక్షుడు గూడా సుందరరావు, అధ్యక్షుడు బొల్లం వీరయ్య, ఉపాధ్యక్షులు ప్రత్తి కృష్ణ, ఎల్.నాగేశ్వరరావు, కార్యదర్శి కలగం ప్రభాకరరావు, సహాయ కార్యదర్శులు ప్రత్తి ఎన్‌వీ సూర్యనారాయణ, గోపిశెట్టి భరతుడు పాల్గొన్నారు.

పాలకోడేరులో మద్యం స్వాధీనం

పాలకోడేరు: పాలకోడేరులో మద్యం కలిగి ఉన్న ఓ వ్యక్తిని అరెస్టు చేసి అతని నుంచి 52 క్వార్టర్ మద్యం బాటిళ్లు స్వాధీనం చేసుకున్నట్లు ఎస్సై నాళం శ్రీనివాసరావు గురువారం చెప్పారు. గ్రామానికి చెందిన మల్లుల వీరాస్వామి బయట నుంచి మద్యం కొని ఇంట్లో పెట్టి సంచుల్లో బయట వాటిని అమ్మడం చేస్తున్నాడన్నారు. తమకు అందిన సమాచారం మేరకు గురువారం దాడి చేసి వీరాస్వామి ఇంటిపై దాడి చేసి మద్యం స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. ఎస్సై వెంట హెడ్ కానిస్టేబుల్ అజరయ్య, నాగరాజు, భవాని కుమారి, బాలకృష్ణ తదితరులు ఉన్నారు.



మద్యం, నిందితుడితో పోలీసులు

గ్రామాల్లో ఉమాబాలకు అపూర్వ ఆదరణ

పెనుగొండ : ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి మహిళా పక్షపాతి అని, సాధారణ మహిళలకు కూడా ఉన్నత స్థానం కల్పించగల మహోన్నత వ్యక్తి అని వైఎస్సార్ సీపీ నర్సాపురం పార్లమెంటు నియోజకవర్గ ఇన్‌చార్జి గూడూరి ఉమాబాల అన్నారు. గురువారం పెనుగొండ మండలం దొంగరావిపాలెం, నడిపూడి, చినమల్లం, ములపర్రు, ఇలపర్రుల్లో ఆత్మీయ పరిచయ సమావేశాలు నిర్వహించారు. ఆయా గ్రామాల్లో మహిళలు అడుగడుగునా నిరాజనం పలికారు. ఆత్మీయ స్వాగతం పలికి ఘన సత్కారం నిర్వహించారు. ముఖ్యంగా ములపర్రు, చినమల్లం, దొంగరావిపాలెం, ఇలపర్రుల్లో శెట్టి బలిజ సంఘాలు ఘనంగా సత్కరించారు. ఎన్నో ఏళ్లుగా ఆర్థికంగా, బలమైన వర్గాలకు కేటాయించే నర్సాపురం పార్లమెంట్ ఇన్‌చార్జి సాధారణ మహిళకు కేటాయించి మహిళా సాధికారిత, సామాజిక న్యాయానికి సీఎం జగన్ కట్టుబడ్డారన్నారు. ఆచంట నియోజకవర్గంలోనూ ఎమ్మెల్యే శ్రీరంగనాథరాజు మహిళలకు అండగా నిలుస్తూ వారి సంక్షేమానికి కృషి చేస్తున్నారన్నారు. బడుగు బలహీన,



ములపర్రులో మహిళలు, శెట్టిబలిజ సంఘాల నాయకులతో ఉమాబాల

దళిత, మైనారిటీ వర్గాలపై నమ్మకంతో ఉన్న సీఎం జగన్ నమ్మకాన్ని వమ్ము చేయకుండా అండగా నిలవాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమాల్లో మండల సర్పంచ్‌ల చాంబర్ అధ్యక్షురాలు దండు పద్మావతి, జిల్లా ప్రధాన కార్యదర్శి దంపనబోయిన బాబూరావు, కార్పొరేషన్ డైరెక్టర్లు మామిడిశెట్టి కృష్ణవేణి, బొక్కా అరుణ,, శేషమ్మ చెరువు సర్పంచ్ జక్కంశెట్టి శ్రీరాములు, ఏఎంసీ వైస్ చైర్మన్ గుబ్బల వీరబ్రహ్మం, కుడిపూడి సుబ్రహ్మణ్యం, నాయకులు జుత్తిగ బాలయ్య, పెచ్చెట్టి జేమ్స్, కేశవరపు గణపతి, పూరిళ్ల శ్రీను, పిల్లి రాంబాబు, గంధ్రేటి అప్పారావు, కుడిపూడి శ్రీను, సరేళ్ల లాజరస్, యాండ్ర శ్రీను, కేశవరపు రమేష్, మండల ఉపాధ్యక్షుడు పులిదిండి వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

జగనన్నతోనే రాష్ట్ర భవిష్యత్

- రాష్ట్ర హోం శాఖ మంత్రి తానేటి వనిత
- మండలంలోని పలు గ్రామాల్లో వైఎస్సార్ సీపీ నేతలతో సమావేశం

ద్వారకాతిరుమల : రాష్ట్ర భవిష్యత్, మన బిడ్డల భవిష్యత్ బాగుండాలంటే జగనన్న మరోసారి సీఎం కావాలని రాష్ట్ర హోం, విపత్తుల నిర్వహణ శాఖ మంత్రి తానేటి వనిత అన్నారు. మండలంలోని గొడుగుపేట, జి.కొత్తపల్లి, సీహెచ్ పోతేపల్లి, మద్దులగూడెం, సాయన్నపాలెం, కోడిగూడెం, కొత్తగూడెం, రామసింగవరం గ్రామాల్లో గురువారం పర్యటించిన ఆమె ఆయా గ్రామాల్లోని వైఎస్సార్ సీపీ నాయకులతో సమావేశాలను నిర్వహించారు. అందులో భాగంగా జి.కొత్తపల్లికి విచ్చేసిన ఆమె ముందుగా మహానేత వైఎస్సార్, డాక్టర్ బీఆర్ అంబేడ్కర్, బాబు జగ్జీవన్‌రామ్ విగ్రహాలకు పూల మాలలు వేసి ఘన నివాళులర్పించారు. అనంతరం జరిగిన సమావేశంలో మంత్రి వనిత మాట్లాడుతూ గత ప్రభుత్వానికి, ప్రస్తుత ప్రభుత్వ పాలనకు మధ్య వ్యత్యాసాన్ని ప్రజలు గమనించాలన్నారు. ప్రతిపక్షాల ఎత్తుగడలను ఎండగడుతూ జగనన్నను మళ్లీ సీఎం చేయాలని ఆమె కోరారు. వైఎస్సార్ సీపీ అధికారంలోకి వచ్చిన తరువాత మ్యానిఫెస్టోలోని హామీలు 99 శాతం అమలు చేశారని, ఇచ్చిన హామీలనే కాకుండా ఇవ్వని హామీలను కూడా నెరవేర్చిన ఘనత జగనన్నకే దక్కిందన్నారు. దేశంలోనే ఎక్కడా లేని విధంగా మన రాష్ట్రంలో మాత్రమే గ్రామ, వార్డు సచివాలయ వ్యవస్థ, వలంటీర్ల వ్యవస్థ ఉందన్నారు. ఇతర రాష్ట్రాలు మన వలంటీర్ వ్యవస్థను అమలు చేయాలని చూస్తున్నాయని, ఇది జగనన్న విజనరీకి తార్కాణమని పేర్కొన్నారు.



జి.కొత్తపల్లిలో పార్టీ నేతల సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి తానేటి వనిత

తమ ప్రభుత్వంలో ప్రతి కుటుంబానికి మంచి జరిగిందని, అందుకే మంచి జరిగితేనే తనకు ఓటు వేయమని జగనన్న దమ్ముగా అడుగుతున్నారన్నారు. గత టీడీపీ ప్రభుత్వంలో ఎవరికైనా కొత్త పెన్షన్ మంజూరు కావాలంటే కులం, మతం, పార్టీ చూసి జన్మభూమి కమిటీలు సిఫార్సు చేసేవని, ఆ తరువాత కూడా ఎవరైనా లబ్ధిదారుడు చనిపోతేనే కొత్త వారికి పెన్షన్ ఇచ్చేవారని ఆమె గుర్తు చేశారు. అలాంటి పరిస్థితుల నుంచి ప్రజలు బయటపడి అర్హత ఉన్న ప్రతి ఒక్కరూ ఈ రోజున ఇంటివద్దే పెన్షన్‌ను అందుకుంటున్నారన్నారు. ప్రజల సంక్షేమం కోసం మహానేత వైఎస్సార్ ఒక అడుగు ముందుకేస్తే ఆయన బిడ్డ జగనన్న నాలుగు అడుగులు ముందుకేస్తున్నారన్నారు. వచ్చే ఎన్నికల్లో మోసపూరిత హామీలతో మీ వద్దకు వచ్చేవారిని నమ్మి మోసపోవద్దని వారికి తగిన బుద్ధి చెప్పి, జగనన్నను గెలిపించేందుకు ప్రజలు సిద్ధం కావాలని ఆమె పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర ఫైనాన్స్ కార్పొరేషన్ డైరెక్టర్ చెలికాని రాజబాబు, ఎంపీపీ బొండాడ మోహిని, జెడ్పీటీసీ సభ్యులు చిగురుపల్లి శామ్యూల్, పార్టీ మండల కన్వీనర్ ప్రతాపనేని వాసు, పార్టీ నియోజకవర్గ మహిళా అధ్యక్షురాలు గారపాటి రమప్రభ, మండల అధ్యక్షురాలు మల్లెపూడి నాగమణి, సర్పంచ్‌లు దాకారపు బంగారమ్మ, కస్సే శ్రీహరిరావు, పోల్కంపల్లి అనిల్, చెలికాని ప్రవీణ్, చెలికాని సంజయ్, ఆచంట బన్ను, పెద్దిరెడ్డి జ్యోతి శ్రీనివాస్, బొండాడ వెంకన్నబాబు, మానుకొండ సుబ్బారావు, గుర్రాల లక్ష్మణ్, ఉప్పల మునేశ్వరరావు, బండారు కాశీ, పల్లపాటి ధర్మారావు, ఆకురాతి ధ్యానేశ్వరరావు, దాసరి ఏసురత్నం, రేగంటి వెంకటేశ్వరరావు, భోగరాజు సాయికృష్ణ, చెలికాని బుల్లియ్య, బిరుదుగడ్డ చల్లారావు, మానుకొండ కన్నయ్య, జంగా వెంకట కృష్ణారెడ్డి, ఆచంట అనసూయ, ఆచంట సురేష్ తదితరులున్నారు.

దాడి చేశారంటూ వలంటీర్ ఫిర్యాదు

కొయ్యలగూడెం: తనపై దాడి చేయడంతో పాటు అడ్డుపడిన తన కుమార్తెను కొట్టి తీవ్రంగా గాయపరిచారంటూ దిప్పకాయలపాడు గ్రామానికి చెందిన వలంటీర్ బడుగు వాణి పోలీసులకు ఫిర్యాదు చేసింది. దళితవాడలోని తన స్థలానికి సంబంధించి అదే గ్రామానికి చెందిన సీహెచ్ వెంకటరత్నం, సీహెచ్ నాగరత్నంలతోపాటు మరో ఏడుగురు దాడి చేశారని గురువారం పేర్కొంది. పూర్వార్జితంగా వస్తున్న తన స్థలంలో వీరు షెడ్డు వేసి ఆక్రమిస్తుండగా అడ్డుకున్నందుకు కొట్టి గాయపరిచినట్లు తెలిపింది. నిందితులను శిక్షించి తనకు న్యాయం చేయాలని పోలీసు, రెవెన్యూ శాఖాధికారులను ఆమె ఫిర్యాదులో కోరింది. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

మనస్పర్థలతో భర్త ఆత్మహత్య

పెనుగొండ : మనస్పర్థల కారణంగా మనస్తాపంతో భర్త ఆత్మహత్యకు పాల్పడ్డాడు. పోలీసులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. దొంగరావిపాలెంకు చెందిన కుడిపూడి వెంకటేష్ (34)కు అదే గ్రామానికి చెందిన జీవనితో పదేళ్ల క్రితం వివాహమైంది. వీరికి ఒక కుమార్తె, కుమారుడు ఉన్నారు. జీవనోపాధి నిమిత్తం హైదరాబాద్‌లో కాపురం ఉంటున్నారు. గత ఆర్నెల్లుగా భార్యాభర్తల మధ్య తరచూ గొడవలు జరుగుతున్నాయి. పెద్దల సమక్షంలో గొడవలు సద్దుమణిగినా ఇటీవల మళ్లీ పెరగడంతో జీవని పుట్టింటికి వచ్చేసింది. భర్తతో పాటు, మరో ఇద్దరిపై పెనుగొండ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. దీంతో మనస్తాపం చెందిన వెంకటేష్ ఈ నెల 19న శానిటైజర్ తాగి ఆత్మహత్యాయత్నం చేశాడు. బంధువులు గుర్తించి తణుకు ఆసుపత్రికి తరలించడంతో చికిత్స పొందుతూ గురువారం మృతి చెందాడు. బంధువుల ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.



వెంకటేష్ మృతదేహం

వైఎస్సార్ సీపీలోకి చేరికలు



వైస్సార్ సీపీలో చేరిన వారిని ఆహ్వానిస్తున్న ఎమ్మెల్యే వాసుబాబు

గణపవరం : నిరంతరం పేదల క్షేమం కోరే ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌కు తామంతా అండగా ఉండాలని నిర్ణయించుకుని వైఎస్సార్ సీపీలో చేరుతున్నామని పలువురు ప్రకటించారు. గణపవరం మండలం అప్పనపేట గ్రామానికి చెందిన 30 మంది వివిధ పార్టీలకు చెందిన నాయకులు గురువారం ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఎమ్మెల్యే పుప్పాల వాసుబాబు సమక్షంలో వైఎస్సార్ సీపీలో చేరారు. వారికి పార్టీ కండువాలు కప్పి వాసుబాబు పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా వాసుబాబు మాట్లాడుతూ ప్రజల కోసం నిరంతరం పరితపిస్తున్న నాయకుడు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అన్నారు, ఇతర పార్టీల నుంచి వచ్చిన వారిని కలుపుకుని ముందుకు వెళ్లాలని పార్టీ నాయకులకు సూచించారు. ఈ కార్యక్రమంలో గణపవరం ఎంపీపీ అర్ధవరం రాము, పార్టీ మండల కన్వీనర్ దండు రాము, అప్పనపేట సర్పంచ్ నూకారపు సుధాకర్, మాజీ సర్పంచ్ నక్కా సూరిబంగారయ్య, ఎంపీటీసీ సభ్యుడు కొల్లి సత్యనారాయణ, మాజీ ఎంపీటీసీ వర్రే వెంకట సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్ అధికారులకు పదోన్నతిపై బదిలీ

ఏలూరు (ఆర్ఆర్‌పేట): తూర్పుప్రాంత విద్యుత్ పంపిణీ సంస్థ ఏలూరు ఆపరేషన్ సర్కిల్ పరిధిలో పనిచేస్తున్న పలువురు అధికారులకు పదోన్నతులు కల్పిస్తూ సంస్థ సీఎండీ పృథ్వీతేజ్ ఇమ్మడి గురువారం ఉత్తర్వులు జారీ చేశారు. భీమవరంలో ఏఈఈగా పనిచేస్తున్న బి.దివాకరరావుకు డిప్యూటీ ఈఈగా పదోన్నతి కల్పించి రంపచోడవరంలో పోస్టింగ్ ఇచ్చారు. ఏలూరు డీ5 సెక్షన్ ఏఈఈ టీ రాజ్‌కుమార్‌కు డిప్యూటీ ఈఈగా పదోన్నతి కల్పించి జీలుగుమిల్లిలో పోస్టింగ్ ఇచ్చారు. నల్లజర్ల డిప్యూటీ ఈఈ డీ రాజుబాబును అమలాపురానికి, చిట్టివలస ఏఈఈ జే రామును పదోన్నతిపై నల్లజర్ల డిప్యూటీ ఈఈగా నియమిస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. కాగా భీమవరం, నరసాపురం, తాడేపల్లిగూడెంలలో పనిచేస్తున్న పలువురు అధికారులకు సైతం రెండు రోజుల్లో స్థానచలనం కలిగే అవకాశం ఉందని తెలిసింది. అలాగే ప్రస్తుతం ఏలూరు సర్కిల్‌ను విభజిత జిల్లాల ప్రాతిపదికగా ఏలూరు, భీమవరం సర్కిళ్లుగా విభజించారని, దీనికి సంబంధించిన ఉత్తర్వులు కూడా మరో నాలుగైదు రోజుల్లో వెలువడే అవకాశం ఉందని విద్యుత్ ఉద్యోగులు చర్చించుకుంటున్నారు.

క్లుప్తంగా

ముత్యాలమ్మ జాతర పోస్టర్ల ఆవిష్కరణ



ముత్యాలమ్మ తల్లి జాతర పోస్టర్ల ఆవిష్కరిస్తున్న దృశ్యం

పెంటపాడు: ఈ నెల 29 నుంచి ముదునూరుపాడు గ్రామ దేవత ముత్యాలమ్మ అమ్మవారి జాతర ఉత్సవాలను నిర్వహిస్తున్నట్లు ఉత్సవ కమిటీ నాయకులు తెలిపారు. ఈ సందర్భంగా గురువారం ఉత్సవకమిటీ సభ్యులు పోస్టర్లను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా కమిటీ సభ్యులు మాట్లాడుతూ వైభవంగా నిర్వహించే ఈ జాతర ఉత్సవాల్లో ఉపముఖ్యమంత్రి, దేవాదాయ శాఖామంత్రి కొట్టు సత్య నారాయణ పాల్గొంటారన్నారు. ప్రతి మూడు సంవత్సరాలకు ఒకసారి జరిగే ఈ జాతర మహోత్సవాలను భక్తులు సద్వినియోగం చేసుకోవాలని కమిటీ సభ్యులు కోరారు.

హెచ్ఐవీ పట్ల అవగాహన అవసరం



హెచ్ఐవీ పై ప్రజలకు అవగాహన కల్పిస్తున్న కళాజాత బృందం

తాడేపల్లిగూడెం (టీఓసీ): హెచ్ఐవీ పట్ల ప్రతి ఒక్కరు అవగాహన కలిగి ఉండాలని జిల్లా ఎయిడ్స్ నియంత్రణ మండలి జిల్లా కళాజాత బృందం సభ్యులు వెల్లడించారు. ఎయిడ్స్ పట్ల ప్రతి ఒక్కరు అప్రమత్తంగా ఉండాలని కోరుతూ కళాజాత బృందం మిరియాల రవి బాబు ఆధ్వర్యంలో వీధి నాటక ప్రదర్శన పట్టణంలోని పలు ప్రాంతాల్లో గురువారం అవగాహన కల్పించారు. ఐసీటీసీ సెంటర్ ఆవశ్యకత, ఏఆర్టీ మందులు ప్రాధాన్యత, హెచ్ఐవీ టోల్‌ఫ్రీ నెంబర్ 1097 గురించి ప్రజలకు ఆట పాటల ద్వారా వివరించారు. ఈ కార్యక్రమంలో గుడ్ ల్యాంప్ ఎన్జీఓ సిబ్బంది పాల్గొన్నారు.

గూడెంలో కొండచిలువ హల్‌చల్



రోడ్డుపై హల్‌చల్ చేస్తున్న కొండచిలువ

తాడేపల్లిగూడెం (టీఓసీ): పట్టణంలో పోలీస్ ఐలాండ్ వద్ద నుంచి స్థానిక 16వ వార్డు జువ్వలపాలెం వైపు వెళ్లే స్టేట్ హైవే మార్గంలో సవితృపేట తూరుల కంపెనీ ప్రాంతంలో డివైడర్‌పై బుధవారం రాత్రి ఓ పిల్ల కొండచిలువ హల్‌చల్ చేసింది. దానిని గమనించిన స్థానికులు కర్రలు తీసుకొని కొండ చిలువను డివైడర్‌పై నుంచి రోడ్డుపైకి తెచ్చారు. వాహనాల వెలుతురులో కొద్ది సేపు రోడ్డుపై నుంచి సమీపంలోని కాలువలోకి వెళ్లిపోయినట్లు స్థానికులు తెలిపారు.

కులగణనలో లోపాలను సవరించాలి



ఎంపీడీవోకు వినతి పత్రం అందజేస్తున్న దృశ్యం

పెంటపాడు: రాష్ట్ర వ్యాప్తంగా కులగణన సర్వేలో ఉన్న లోపాలను రాష్ట్ర ప్రభుత్వం సవరించేలా చూడాలని గూడెం క్రైస్తవ సంఘ నాయకులు ఎంపీడీవోకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా గురువారం గూడెం ఎంపీడీవోకు యునైటెడ్ పాస్టర్స్‌ఫెలోషిప్ సంఘ అధ్యక్షుడు మల్లిపూడి జైబాబు, బిషప్ ఐజక్ ముగ్గళ్ల ఆధ్వర్యంలో సంఘ సభ్యులు వినతి పత్రాలు సమర్పించారు. ఈ కార్యక్రమంలో సంఘ సభ్యులు కె. రత్నరాజు, రాజ్‌కుమార్, శామ్యూల్ సునీల్, జోసఫ్, ఇమ్మానియేలు, రాజబాబు తదితరులు పాల్గొన్నారు.

గ్రంథాలయాలు విజ్ఞాన భాండాగారాలు



వాటర్ ఫిల్టర్‌ను ప్రారంభిస్తున్న దృశ్యం

తాడేపల్లిగూడెం (టీఓసీ): గ్రంథాలయాలు విజ్ఞాన భాండాగారాలని, విద్యార్థులు తప్పనిసరిగా గ్రంథాలయాలను సందర్శించి తమ విజ్ఞానాన్ని పెంపొందించుకోవాలని ఇండియన్ బ్యాంక్ జోనల్ మేనేజర్ పీఎస్ఎస్ సుధాకర్‌రావు చెప్పారు. స్థానిక గ్రేడ్–1 శాఖా గ్రంథాలయానికి ఇండియన్ బ్యాంక్ తరుపున బ్లూ స్టార్ నూతన కూలింగ్ వాటర్ ఫిల్టర్‌ను ఆయన ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో గ్రంథాలయాధికారి వాసపల్లి శ్రీనివాసరావు, బ్యాంక్ బ్రాంచ్ మేనేజర్ పీఎల్ నరసింహారావు, అసిస్టెంట్ బ్రాంచ్ మేనేజర్ బి.రఘురాం, బ్యాంక్ మేనేజర్ ఎస్.పాత్ర, గ్రంథాలయ పాలకులు తదితరులు పాల్గొన్నారు.

ఆర్బీకేలు రైతు నేస్తాలు

- నాలుగేళ్లుగా విశేష సేవలు
- సొంత గ్రామాల్లోనే రైతులకు అన్నీ లభ్యం
- విత్తు నుంచి విక్రయం దాకా అన్నదాతకు ఆసరా



దర్శిపర్రులోని రైతు భరోసా కేంద్రం

పెంటపాడు: ఒకప్పుడు రైతులన్న, వారు పడుతున్న కష్టాలన్న ఎవరికీ పట్టేది కాదు. ఏ సమయంలో ఏ పంట వేయాలి, ఏరకం విత్తనాలు, భూసారపరీక్షలు, ప్రకృతి వైపరీత్యాల సమయంలో ముందస్తు హెచ్చరికలు తదితర సమాచారం అందుబాటులో లేక ఆయోమయంలో ఉండే పరిస్థితి ఆనాటి అన్నదాతది. నేటి పరిస్థితి అందుకు భిన్నంగా ఉంది. ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి అధికారంలోకి వచ్చాక అన్నదాతకు అండగా నిలబడ్డారు. పంట నాటింది మొదలు, చేతికి వచ్చిన పంటను అమ్మి సొమ్ము చేసుకొనే వరకు ప్రతి దశలో ఎప్పుడు ఏ అవసరమైన సమాచారం కావాలన్న నేనున్నానంటూ నిలబడి రైతు భరోసా కేంద్రాలు(ఆర్బీకే)లు ఏర్పాటు చేశారు. ఇవి ప్రస్తుతం దేశంలోని అన్ని రాష్ట్రాలకు ఆదర్శంగా నిలుస్తున్నాయి. నాలుగేళ్లలో రైతు నేస్తాలుగా మారాయి. మండలంలో 21 గ్రామాల్లో రైతు భరోసా కేంద్రాలు ఉన్నాయి. వాటి ద్వారా మండలంలోని 24 వేల ఎకరాల రైతులకు సేవలు అందుతున్నాయి.

అన్ని రకాల సేవలు

గతంలో రైతులకు ఏ అవసరం వచ్చినా మండల కేంద్రంలోని వ్యవసాయ శాఖ కార్యాలయానికి వెళ్లాల్సి వచ్చేది. ప్రస్తుతం రైతులు సొంత ఊరిలోని ఆర్బీకేలనే రైతులు ఆశ్రయించి సమగ్ర సమాచారం పొందుతున్నారు.

కియాస్క్‌తో ఎన్నో ప్రయోజనాలు: రైతుల కోసం ఆర్బీకేల్లో ఏర్పాటు చేసిన కియోస్కల ద్వారా సబ్సిడీ ఎరువుల, విత్తనాలను 48 గంటల్లోనే వీఏఏల ద్వారా రైతులకు తక్షణం అందజేస్తున్నారు. గతంలో విత్తనాల కోసం రైతులు ఎన్నో పాట్లు పడాల్సి వచ్చేది. ప్రస్తుతం సబ్సిడీపై ఎరువులు, విత్తనాలు సరఫరా చేస్తున్నారు. వ్యవసాయ పనిముట్లతో పాటు, ట్రాక్టర్లు, గడ్డికోత యంత్రాలు, కోత మిషన్, నాట్లు వేసే యంత్రం తదితర పనిముట్లు పంపిణీ చేస్తున్నారు. ఏ తెగులుకు ఏ మందు వాడాలో తెలియజెప్పేందుకు వీలుగా ఈ యంత్రాల్లో రైతు కాలెండర్‌ను పొందుపరిచారు. దీని వల్ల రైతులు ఇష్టాను సారంగా పురుగుమందులు వాడకుండా సమయాన్ని, డబ్బును ఆదా చేసుకొంటున్నారు. ప్రకృతి విపత్తులు, తుఫానుల వల్ల రైతులు నష్టపోకుండా ఉండేలా ఈ క్రాప్ బుకింగ్, పంట నష్టపరిహారం ప్రతి రైతు పొందేలా ఏర్పాటు చేశారు. ఈ క్రాప్ ధ్రువ పత్రం ద్వారా బ్యాంకులు రైతులకు పంట రుణాలు అందజేస్తున్నాయి.

ఈ క్రాప్ బుకింగ్‌తో ఎంతో మేలు

రైతులకు ఆయా సీజన్‌ల్లో ఎరువులు, విత్తనాలు అందుబాటులో ఉంటున్నాయి. సీజన్‌లతో సంబంధం లేకుండా అన్నీ రైతులకు దొరుకుతున్నాయి. మార్కెట్ ధరకన్నా ఆర్బీకేల్లో విత్తనాలు, తక్కువ ధరకే దొరుకుతున్నాయి.

జగనన్నకు రుణపడి ఉంటాం



ఈ క్రాఫ్ బుక్కింగ్ వల్ల రైతులకు ఎంతో ఉపయోగంగా ఉంది. దీని కోసం ఆర్బీకే సిబ్బంది ఖరీఫ్, రబీ సీజన్‌లలో చేపట్టే ఈ క్రాప్ మాలాంటి రైతులకు ఎంతో ఉపయోగంగా ఉంది. ప్రకృతి వైపరీత్యాల వల్ల పంట దెబ్బతిన్నా ఇన్సూరెన్స్‌ను జగనన్న ప్రభుత్వం సకాలంలో అందిస్తోంది. పంటల బీమా పథకం కింద నష్టపరిహారం రావడం పట్ల సీఎం జగనన్నకు ఎంతో రుణపడి ఉంటాం.

– కట్టుబోయిన కృష్ణప్రసాద్, జట్లపాలెం

ఆర్బీకేలను సద్వినియోగం చేసుకోండి



రైతు భరోసా కేంద్రాల ద్వారా రైతులకు మరిన్ని సేవలు అందిస్తున్నాం. ఎక్కడా రైతులకు ఇబ్బందులు తలెత్తకుండా అన్నీ సీజన్‌లోనూ సేవలందిస్తున్నాం. ఆర్బీకే సేవలను ప్రతి రైతు సద్వినియోగం చేసుకోవాలి

– కె. పార్థసారథి, మండల వ్యవసాయాధికారి

సామాజిక సేవే లక్ష్యంగా పనిచేస్తాం



వృద్ధులకు బియ్యం, నిత్యావసర సరుకులు అందజేస్తున్న దృశ్యం

తాడేపల్లిగూడెం రూరల్: పేద, అనాథ వృద్ధులకు సేవ చేసే లక్ష్యంతోనే వల్లీ, మోహన్ యువజన సేవా సమితి ఆవిర్భవించిందని ఆ సంస్థ గౌరవాధ్యక్షుడు ఉండ్రాజవరపు భాస్కర్‌రావు, అధ్యక్షుడు పఠాన్ వలీ పేర్కొన్నారు. గురువారం మండలంలోని ఎల్.అగ్రహారం ఇందిరమ్మకాలనీలో వల్లీ, మోహన్ యువజన సేవా సమితి కార్యాలయాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ దాతల సహకారంతో సామాజిక సేవా కార్యక్రమాలు నిర్వహించడం జరుగుతుందన్నారు. తమ సంస్థకు సహకరించే దాతలు ఎల్.అగ్రహారంలోని తమ కార్యాలయాన్ని సంప్రదించాలని కోరారు. అలాగే దాతల సహకారంతో ఉన్నా, లేకపోయినా తమ సంస్థ తరపున సేవా కార్యక్రమాలు నిర్విరామంగా కొనసాగిస్తామన్నారు. అనంతరం ఇరువురు వృద్ధులకు బియ్యం, కూరగాయలు, నిత్యావసర సరుకులను అందజేశారు. ఈ కార్యక్రమంలో ప్రధాన కార్యదర్శి గొల్లేరు మోహన్, కోశాధికారి గజ్జెల సమర్పణరావు, ఉపాధ్యక్షులు బచ్చు దినేష్, మెంటే రాంబాబు, పోలిశెట్టి రంగ, కోడేటి శ్రీరామ్, పఠాన్, సుభాని, నేదూరి సత్యనారాయణ, కామిశెట్టి మూర్తి తదితరులు పాల్గొన్నారు.

దేశానికి మానవ వనరులే కీలక ఆస్తి



నిట్‌లో మాట్లాడుతున్న వ్యక్తిత్వ వికాస నిపుణుడు సురేష్ నాయక్

తాడేపల్లిగూడెం: దేశానికి మానవ వనరులు ఎంతో కీలకమని వ్యక్తిత్వ వికాస నిపుణుడు డాక్టర్ సురేష్ నాయక్ అన్నారు. ఏపీ నిట్‌లో ఇనిస్టిట్యూట్ ఇన్నోవేషన్ కౌన్సిల్ సౌజన్యంతో ఆటిట్యూడ్ అండ్ బిహేవియర్ డెవలప్‌మెంటు అనే అంశంపై గురువారం సాయంత్రం ఏర్పాటు చేసిన వర్కుషాపులో ఆయన మాట్లాడారు. దేశ ప్రగతిలో పరిశోధన ఎంతో కీలక పాత్ర పోషిస్తుందన్నారు. శాస్త్ర సాంకేతిక రంగాల్లో వస్తున్న విప్లవాత్మక పరిణామాలను ప్రతి విద్యార్థి ఎప్పటికప్పుడు అంచనా వేస్తూ ముందుకు సాగాలన్నారు. ప్రయోగశాలలో ఒక వైజ్ఞానిక పరిశోధన కోసం శాస్త్రవేత్తలు ఏళ్ల తరబడి అంకి తభావంతో కృషి చేస్తారన్నారు. దేశానికి చెందిన ప్రముఖ శాస్త్రవేత్త సుభాష్ చంద్రబోస్ తన పరిశోధనలతో ప్రపంచ వ్యాప్తంగా ఎంతో కీర్తి గడించారన్నారు. అలాంటి వారి స్ఫూర్తితో విద్యార్థులు విభిన్నంగా ఆలోచిస్తూ కొత్త పరిశోధనలను చేపట్టాలన్నారు. విద్యార్థుల సందేహాలను నివృత్తి చేశారు. ఈ కార్యక్రమంలో డీన్ రీసెర్చ్ అండ్ కన్సల్టెన్సీ జీఆర్కె.శాస్త్రీ, డీన్ వీరేష్‌కుమార్, ఆచార్యులు వి.సందీప్, ఫణికృష్ణ, సంతోష్, కార్తికేయశర్మ, సుదర్శనదీప తదితరులు పాల్గొన్నారు.

రైతులపై దాడులకు పాల్పడిన వారిపై చర్యలు తీసుకోవాలి



జగన్నాథపురం గ్రామంలో జరిగిన ఇఫ్టూ సమావేశ దృశ్యం

తాడేపల్లిగూడెం రూరల్: రైతులపై దాడులకు పాల్పడిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని ఇఫ్టూ జిల్లా సహాయ కార్యదర్శి మామిడి దానవరప్రసాద్ డిమాండ్ చేశారు. గురువారం మండలంలోని జగన్నాథపురం గ్రామంలో మంచాల సత్తిపండు అధ్యక్షతన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా దానవరప్రసాద్ మాట్లాడుతూ హర్యానాలో బీజేపీ ప్రభుత్వ దమన కాండకు శుభకరణ్ సింగ్ అనే యువ రైతు బలయ్యాడని ఆవేదన వ్యక్తం చేశారు. మరో 25మంది గాయపడ్డారన్నారు. తాము పండించిన పంటకు మద్దతు ధర కావాలని కోరడమే నేరమైనట్లుగా కేంద్ర ప్రభుత్వం,హర్యానా ప్రభుత్వం రైతులపై దాడులకు దిగుతుందన్నారు. ఈ సంఘటనను సుప్రీంకోర్టు సుమోటోగా స్వీకరించాలని, తిరిగి పునరావృతం కాకుండా కట్టుదిట్టమైన చర్యలు చేపట్టాలన్నారు. రైతులు చేస్తున్న పోరాటానికి ఇఫ్టూ మద్దతు తెలియజేస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో మంచాల సత్తిపండు, నీలం సత్తిబాబు, జి.దుర్గారావు, ఎన్.పోసిబాబు, ఎన్.దుర్గారావు, టి.సూరిబాబు, వై.దుర్గారావు, ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులు అబ్దుల్ కలాంను స్ఫూర్తిగా తీసుకోవాలి



విద్యార్థులకు విద్యా సామగ్రిని అందజేస్తున్న ఈమని రామకృష్ణ దంపతులు

తణుకు టౌన్: విద్యార్థులు భారత రత్న మాజీ భారత రాష్ట్రపతి ఏపీజే అబ్దుల్ కలాంను ఆదర్శంగా తీసుకొని తమ కలలను నిజం చేసుకోవాలని మానవత జిల్లా శాంతి ర్యాలీ చైర్మన్ గమిని రాంబాబు తెలిపారు. గురువారం తణుకు వెంకట్రాయపురం మండల పరిషత్ పాఠశాలలో జరిగిన కార్యక్రమంలో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడారు. తణుకు పట్టణానికి చెందిన ఈమని సీతాపతిరావు జ్ఞాపకార్థం వారి కుమారులు విద్యార్థులకు విద్యాసామగ్రిని అందజేశారు. ఈ సందర్భంగా రామకృష్ణ మాట్లాడుతూ సైంటిస్ట్‌గా అబ్దుల్ కలాం 26సంవత్సరాలు పని చేశారన్నారు. ఈ కార్యక్రమంలో ఈమని త్రిపుర సుందరి, ఈమని పద్మావతి, హెచ్‌ఎం, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

నేడు 'గూడెం' మండలంలో మంత్రి సుడిగాలి పర్యటన

తాడేపల్లిగూడెం రూరల్: మండలంలోని పలు గ్రామాల్లో శుక్రవారం జరగనున్న అభివృద్ధి కార్యక్రమాల ప్రారంభోత్సవ, శంకుస్థాపనల్లో డిప్యూటీ సీఎం కొట్టు సత్యనారాయణ పాల్గొంటారని క్యాంపు కార్యాలయ ప్రతినిధులు తెలిపారు. ఈ మేరకు గురువారం రాత్రి ఒక ప్రకటన విడుదల చేశారు. ఎల్.అగ్రహారంలో వెల్‌నెస్ సెంటర్, పట్టింపాలెం ఆర్బీకే, కొమ్ముగూడెం పీఎంజీఎస్‌వై రోడ్డు, పెదతాడేపల్లి సచివాలయం, ఆర్బీకే భవనాలను ప్రారంభిస్తారన్నారు. అలాగే, జగన్నపేట, దండగర్ర వెల్ నెస్ సెంటర్లు, ఆర్బీకే, కొత్తూరులో వెల్‌నెస్ సెంటర్, కృష్ణాయపాలెంలో గ్రామ సచివాలయం, ఆర్బీ కే, ఆరుళ్ల వెల్‌నెస్ సెంటర్లకు శంకుస్థాపన, ప్రారంభోత్సవాలు నిర్వహిస్తారని క్యాంపు కార్యాలయ ప్రతినిధులు వివరించారు. ప్రజాప్రతినిధు లు, అధికారులు, పార్టీశ్రేణులు పాల్గొనాలని కోరారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

తాడేపల్లిగూడెం (టీఓసీ): పట్టణంలోని 33/11కేవీ హౌసింగ్‌బోర్డు సబ్ స్టేషన్ పరిధిలో 11కేవీ రిలయన్స్ ఫీడర్ విద్యుత్ మరమ్మతుల నిమిత్తం శుక్రవారం ఉదయం 8.30 గంటల నుంచి మధ్యాహ్నం 12.30 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు ఏపీఈపీడీసీఎల్ ఈఈ ఎస్.వెంకటేశ్వరరావు వెల్లడించారు. గణేష్‌నగర్, గాంధీ బొమ్మ సెంటర్, హౌసింగ్ బోర్డు, గవర్నమెంట్ ఆస్పత్రి ఏరియాల్లో విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు పట్టణంలోని విద్యుత్ వినియోగదారులు సహకరించాలని కోరారు.

చలంచర్లకు సతీవియోగం



చలంచర్ల సాయి నవభారతి

తాడేపల్లిగూడెం: పట్టణ ఆర్య వైశ్య ప్రముఖులు వాసవీ ఇంజనీరింగ్ కళాశాల పాలకవర్గ కార్యదర్శి చలంచర్ల సుబ్బారావు సతీమణి సాయినవ భారతి(70)గురువారం ఉదయం స్వర్గస్థులయ్యారు. గత కొద్దికాలంగా అనారోగ్యంతో బాధపడుతూ , చికిత్సపొందుతూ మరణించారు.భారతి ఆకస్మిక మృతి పట్ల కళాశాల పాలకవర్గం, బోధనాసిబ్బంది సంతాపం వ్యక్తం చేశారు. ఇంజనీరింగ్, ఫార్మసీ కళాశాలల ప్రిన్సిపాల్స్ డాక్టర్ రత్నాకర్‌రావు, డాక్టర్ భాస్కరరాజు , డీన్ డాక్టర్ రాంబాబు, వివిధ విభాగాల అధిపతులు , టీచింగ్, నాన్‌టీచింగ్ సిబ్బంది భారతి పార్థీవదేహాన్ని సందర్శించి నివాళులర్పించారు.

ఎస్సీలను అవమానించిన వ్యక్తి చంద్రబాబు



ఇల్లిందలపర్రులో అంబేద్కర్ విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న ఎస్సీ నాయకులు

ఇరగవరం: ఎస్సీ కులంలో ఎవరైన పుట్టలనుకుంటారా అని ఎస్సీలను అవమానించిన వ్యక్తి ప్రతిపక్ష, టీడీపీ అధినేత చంద్రబాబునాయుడని తణుకు నియోజకవర్గ ఎస్సీ సెల్ అధ్యక్షుడు పొట్ల సురేష్ అన్నారు. గురువారం ఇరగవరం మండల ఎస్సీ సెల్ అధ్యక్షుడు గోగి బాబీ అధ్వర్యంలో తూర్పు విప్పర్రు, ఏలేటిపాడు, కె ఇల్లిందలపర్రు గ్రామాల్లో ఎస్సీలకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ముందుగా డాక్టర్ బిఆర్ అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎస్సీలను అవమానించిన చరిత్ర చంద్రబాబుది అయితే అదే ఎస్సీలకు ఉన్నతమైన మంత్రి పదవులు ఇచ్చి, పారిశ్రామిక వేత్తలు, ఎక్కువ కులలకు చెందిన వాళ్లు మాత్రమే వెళ్లగలిగే రాజ్యసభలో ఎస్సీలకు ప్రాతినిధ్యం కల్పించడం ఒక్క సీఎం జగనన్నకే సాధ్యమన్నారు. విద్యా వ్యవస్థలో సమూల మార్పులు తీసుకు వచ్చి ప్రతి పేద పిల్లలకు ఇంగ్లీషు విద్యను అందజేసిన ఘనత సీఎం జగన్‌కు దక్కుతుందన్నారు. ఈ కార్యక్రమంలో పార్టీ మండల ఉపాధ్యక్షుడు జాలి సుబ్బారావు, ఎస్సీ సెల్ కన్వీనర్ ఎస్‌వి జాకబ్ బాబు, కోటి పండు, తదితరులు పాల్గొన్నారు.

నేడు కృష్ణ మాదిగ గూడెం రాక



మాట్లాడుతున్న మాదిగ లాయర్స్ ఫెడరేషన్ ఉమ్మడి జిల్లా కార్యదర్శి చెప్పల వాసు

తాడేపల్లిగూడెం (టీఓసీ): మాదిగ రిజర్వేషన్స్ పోరాట సమితి (ఎంఆర్‌పీఎస్) వ్యవస్థాపక అధ్యక్షుడు మంద కృష్ణ మాదిగ రాష్ట్ర పర్యటనలో భాగంగా ఈ నెల 23న శుక్రవారం తాడేపల్లిగూడెం గీత ఫంక్షన్ హాల్‌కు విచ్చేస్తున్నారని, పర్యటనను విజయవంతం చేయాలని మాదిగ లాయర్స్ ఫెడరేషన్ ఉమ్మడి జిల్లా కార్యదర్శి చెప్పుల వాసు వెల్లడించారు. స్థానిక గీత ఫంక్షన్ హాల్‌లో గురువారం జరిగిన సమావేశంలో వక్తలు మాట్లాడుతూ ఎస్సీ వర్గీకరణ విషయంలో ధర్మాసనం సుదీర్ఘ వాదనలు తీర్పు రిజర్వు చేశారని తెలిపారు. ఈ కార్యక్రమంలో మహాజన సొసిలిస్ట్ పార్టీ జిల్లా కార్యదర్శి దూలపల్లి శ్రీనివాస్, ఎంఆర్‌పీఎస్ రాష్ట్ర నాయకులు బొల్లిపో రత్నాజీ, నియోజకవర్గ నాయకులు దేవతల శివాజీ, కొల్లి రాజశేఖర్, లంకా రాజశేఖర్, గాలింకి ప్రేమాకుమార్, కంకట రవి కుమార్ తదితరులు పాల్గొన్నారు.

అంగన్‌వాడీ పోస్టుల భర్తీకి దరఖాస్తుల ఆహ్వానం

ఇరగవరం: మండలంలోని ఖాళీగా ఉన్నా అంగన్‌వాడీ సహాయకురాలు 03 పోస్టులకు దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు తణుకు ఐసీడీఎస్ ప్రాజెక్టు అధికారిణి ఎంవీఎస్ ప్రమోదిని కుమారి తెలిపారు. సూరంపూడి–1 ఎస్సీ, రాపాక–1 ఎస్సీ, పొదలాడ ఓపెన్ కేటగిరిల్లో దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు తెలిపారు. అభ్యర్థులు పదో తరగతి ఉత్తీర్ణ సాధించి ఉండాలని, సంబంధిత ధ్రువీకరణ పత్రాలతో ఈ నెల 23వ తేదీ నుంచి మార్చి 1వ తేదీ సాయంత్రం వరకు సుధా ఆస్పత్రి దగ్గర ఉన్న ఐసీడీఎస్ కార్యాలయంలో దరఖాస్తులను అందజేయాలని కోరారు.

నేటి నుంచి రాచర్లలో క్రీస్తు సభలు

పెంటపాడు: మండలంలోని రాచర్ల రూపాంతర దేవాలయంలో ఈనెల 23,24 తేదీల్లో ఓపెన్ లైఫ్ పేరిట క్రీస్తు సభలు నిర్వహిస్తున్నట్లు సంఘ కాపరి స్వప్న ఎడ్వర్డ్స్ ఒక ప్రకటనలో తెలిపారు. ప్రతి రోజు రాత్రి 7 గంటలకు నిర్వహించబోయే ఈ సమావేశాలకు హైదరాబాద్ లైఫ్ టెంపుల్‌కు చెందిన డాక్టర్ ఆషీర్ ఆండ్రూ ముఖ్యవక్తగా దేవుని సందేశం ఇస్తారన్నారు. ఈ సమావేశంలో యూత్ సంఘ సభ్యులు పాల్గొన్నారు.

హెచ్చరిక

మా క్లయింటు శ్రీమతి తమ్మిశెట్టి వెంకటలక్ష్మి W/o.తమ్మిశెట్టి వేంకటేశ్వరరావు, పరసయ్య అగ్రహారం, భీమవరం వారి సంబాయిషీ మేరకు యావన్మందికీ తెలియచేయునది ఏమనగా .

తాడేపల్లిగూడెం మండలం,పడాల గ్రామంలోని ఆర్.సర్వే నెం.247/11బి లోను 6-02 సెంట్లు భూమి మరియు దెందులూరుమండలం, శింగవరం గ్రామంలోని ఆర్.సర్వేనెం.53లో యం.2.65ట్లు భూములు పులి సుబ్బారావు గారివి. వారు వారి జీవిత కాలములో ఏవిధమైన ఏర్పాటు చేయక సహజంగా కాలం చేసినారు.

సదరు ఆస్తులు,ఇతర ఆస్తుల పంపకము చేయమని కోరుతూ మా క్లయింటుశ్రీ ఏలూరు ప్రిన్సిపల్ జిల్లా కోర్టులో 24/2020 దావా దాఖలు చేసినారు. మరియు మా క్లయింటు తల్లిగారు శ్రీమతి పులి సత్యవతిగారు W/o.శ్రీసుబ్బారావు,ఆంధ్రప్రదేశ్ హైకోర్టులో డబ్ల్యు.పి.నెం.3040/2022 దాఖలు చేసి సదరు పైన పేర్కొన సర్వే నంబర్లు వాటికు భూములు, ఇతర భూములకు సంబంధించి ఏవిధమైన అన్యాక్రాంతములు పొందకుండా ఉత్తర్వులు పొందినారు.

శ్రీ పులిరామానుజయ్య వారి కుటుంబ సభ్యులు మరియు శ్రీ పులి వెంకటేశ్వరరావు వారి కుటుంబ సభ్యులు పోర్జరీ సంతకాలతో దొంగ డాక్యుమెంట్లు సృష్టించి ఆస్తి అన్యాక్రాంతం చేయుటకు ప్రయత్నించుచున్నారు.ఆ విధంగా చేసిన అవి కోర్టు ఉత్తర్వుల ధిక్కారము అగును.

కావున పై ఆస్తులకు సంబంధించి ఏవిధమైన అన్యాక్రాంతములుసృష్టించినను అవిచెల్లవు అట్టివారి పై తగు సివిల్&క్రిమినల్ చర్యలు మా క్లయింట్ తీసుకోగలరు.

ఏలూరు
19.02.2024

ఎస్.వి.ఆర్.గాంధీ
అడ్వకేట్ , ఏలూరు

శరవేగంగా అభివృద్ధి

- స్త్రీ సమాజం రోడ్డులో అభివృద్ధి జోరు
- రూ. 55 లక్షలతో డ్రైయినేజీ నిర్మాణం
- గత టీడీపీ హయాంలో నిర్లక్ష్యం



రోటరీ క్లబ్ సమీపంలో నిర్మాణం చేపట్టిన డ్రైయినేజీ



స్త్రీ సమాజం రోడ్డులో ముళ్లపూడి లైబ్రరీ సమీపంలో అభివృద్ధి పనులు

తణుకు: తణుకు పట్టణంలో ప్రగతి పరుగులు తీసింది. అభివృద్ధిలో చెరగని ముద్ర వేసింది. అన్నింటా దూసుకుపోతుంది. వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం అభివృద్ధి, సంక్షేమానికి పెద్దపీట వేసిన సంగతి తెలిసిందే. గత ప్రభుత్వంలో తణుకు పట్టణంలోని వార్డుల అభివృద్ధిని ఏనాడు పట్టించుకోలేదు. వైఎస్సార్ సీపీ సర్కారు అధికారంలోకి వచ్చాక వార్డులను ఆధునికంగా తీర్చిదిద్దుతున్నారని జనం కితాబిస్తున్నారు. మౌలిక వసతులను కల్పించడంతోపాటు రోడ్లు, డ్రైయినేజీలతో పాటు మరెన్నో అభివృద్ధి పనులు ప్రజలకు అవసరమైనవన్నీ నిర్మిస్తున్నారు. తణుకు పట్టణంలోని గత టీడీపీ పార్టీ హయాంలో నిర్లక్ష్యంచేసిన అభి వృద్ధి పనులను రూ.కోట్లు వెచ్చించి చేపట్టిన అభివృద్ధి పనులతోపాటు సీఎం పాలనపై స్థానికులు హర్షం వ్యక్తంచేస్తున్నారు.

ప్రగతి పథంలో తణుకు

తణుకు మున్సిపల్ పరిధిలోని పలు వార్డులు ప్రగతి పథంలో దూసుకుపోతోంది. ఏడాదిన్నరగా అనేక అభివృద్ధి పనులు శరవేగంగా జరుగుతున్నాయి. స్థానిక స్త్రీ సమాజం రోడ్డు అభివృద్ధిలో భాగంగా రూ. 55 లక్షల వ్యయంతో రోడ్డుకు ఇరువైపులా 750 మీటర్లు మేర డ్రెయినేజీల నిర్మాణం చేపట్టారు. తణుకు పట్టణంలోని పలువురు టీడీపీ సానుభూతిపరులకు చెందిన ఆస్తులను ఆనుకుని సైతం అభివృద్ధి పనులు చేపడుతుండటం విశేషం. స్త్రీ సమాజం రోడ్డు లోని ముఖ్యంగా ముళ్లపూడి వెంకట్రాయ మెమోరియల్ లైబ్రరీ సమీపంలోని రోడ్డుకు ఇరువైపులా డ్రైయినేజీ విస్తరణ పనులను గత టీడీపీ హయాంలో నిర్లక్ష్యం చేశారు. కేవలం రోడ్డు నిర్మాణం మాత్రం చేపట్టిన అప్పటి పాలకులు డ్రెయినేజీ వ్యవస్థను గాలికి వదిలేశారు. అయితే జగన్‌మోహన్‌రెడ్డి అధికారంలోకి వచ్చిన నాటినుంచి కులం,మతం, ప్రాంతం, పార్టీ బేధం లేకుండా అభివృద్ధి, సంక్షేమాన్ని ఆమలు చేస్తున్నారు. దీంతోపాటు స్థానికంగా రాష్ట్ర మంత్రి కారుమూరి వెంకటనాగేశ్వరరావు ఆదేశాలతో అధికార యంత్రాంగం అభివృద్ధి పనులపై దృష్టి సారించారు.

గత కొన్నేళ్లుగా నిర్లక్ష్యం

తణుకు పట్టణంలోని దాదాపు ఎక్కువ శాతం ఖాళీ స్థలాలు టీడీపీ మద్దతుదారులకు చెందినవి ఉన్నాయి. ముఖ్యంగా స్త్రీ సమాజం రోడ్డులోని రోడ్డుకు ఇరువైపులా ఖాళీస్థలాల్లో వర్షాకాలంలో వర్షపునీరు నిల్వ ఉండటంతో స్థానికులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఈ ప్రాంతంలో డ్రెయినేజీ వ్యవస్థ లేకపోవడంతో మురుగునీరు నిల్వఉండి దోమలు, పాములు ఆవాసాలు ఏర్పాటు చేసుకుంటున్నాయి. అయితే గత టీడీపీ హయాంలో సైతం ఆయా ప్రాంతాల అభివృద్ధిపై దృష్టి సారించకపోవడంతో స్థానికులు అవస్థలు ఎదుర్కొంటున్నారు. దీంతో రాష్ట్ర మంత్రి కారుమూరి వెంకటనాగేశ్వరరావు చొరవతో స్థానికుల ఇబ్బందులను గుర్తించి ఈ ప్రాంతంలో డ్రెయినేజీ వ్యవస్థ ఏర్పాటుకు చర్యలు చేపట్టారు. ప్రస్తుతం డ్రెయినేజీ నిర్మాణం చురుగ్గా సాగుతుండటంతో స్థానికులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.